# తిరుగుబాటు

పెద్దకథ

**ఎస్. రాములు**

(గత సంచిక తరువాయి)

*  *  *  *

చీకటైంది. చుట్టలంటుకున్నయి. అవి రాయలసీమవాళ్ల గజంనర ఎత్తున్న గుడిసెల గుంపులు.

"వారం రోజులాయెనే జరమచ్చి!...అసలే సాతనైతలేదు. తిండిగుడ సయిపుత లేదు. సక్కగ పన్జేత్తలేరని మేస్త్రి ఎల్లయ్య బండబూతులు తిట్టవట్టె. ఆని బండబూతులకు బయపడి పనిజేత్తున్న గని సలీరంల ఈసమెత్తు తాకతులేదే" నర్సయ్య అన్నడు.

"నర్సన్నా! యింటిమీదికి పానం గొట్టుకుంటాందే. ఇల్లిడిసచ్చి నాల్నెల్లాయె. మందుమాకులు లేకుంట ఇంక గిట్లనే యింకో ఆరం పదిరోజులు ఈన్నే ఉంటె, యిక్కన్నుంచి మన పీనుగలే ఎల్లెటట్టున్నయే. మనం మన ఊరికోదామే"

"ఔనే! ఈడన్నది నిజమేనే ఆని తిట్లకు బయపడి పనిజేత్తన్నంగని ఎవల సలీరంల ఈసమెత్తన్న తాకతున్నాదే? నిన్న చక్కరచ్చి అడ్డంబడితె నాగరీకం దొబ్బుతున్నవేందిర అని తిట్టలేదె? పనిజెయ్యకపంటె తిండి నీ తాతవెత్తడా అనవట్టె"

"ఔ! ఔనె! బతికుంటె బలుసాకు తినచ్చు ఇంటికి వోదామే" లోపలికి ఎండుకుపోయి తేలిన బరిబత్త బొక్కలను ఎంచుకుంట అన్నడు ఆగయ్య.

"మనకు అచ్చేకాడికి పైసలు లెక్కగట్టి యిమ్మనాలె"

"ఇంక వాడేం పైసలిత్తడుర! పైసలమీద ఆసవెట్టుకున్నావ్ యింక! ఇంక ఆడే మనకిచ్చిన అడ్వాన్సులకెల్లి నాకే పైసలు దేత్తయని లెక్కలు దీత్తడు. దబాయిత్తడు.

అదిగాక మనం బోతున్నట్టు దెలిత్తె బొక్కలిరుగదంతరు. మనం బోయేది పురుగుకు గూడ తెల్వద్దు."

"అవునె! రేపు రాత్రికి ఉన్నకాడికి అన్ని సదురుకొని పోదాం."

"మనం ఈడ సామాను సదురుకుంట జేత్తె ఆ లోపల ఆల్లచ్చి మెత్తగదంతరు. అదిగాక మనకున్న సామానేందె రెండన్నందినే గిన్నెలేగదనే! పీకితే పీకని! అంతగొడ్తె అయిదా్రరూపాల సామానుగాదు."

"పానం కన్న ఎక్కువనా! సామాను ఈన్నే పారేసిపోదాం"

"అవు ! నువు జెప్పింది మంచిగున్నది." కనుకవ్వ అన్నది.

*　　　　*　　　　*

అది అందరూ నిద్రవోయిన యాల్ల. గడియారంల ఎంతైతాందో తెలిసి నట్టు లేదు ఆల్లకు.

కాల్లతో కాలాన్ని దాటేస్తూ కిలోమీటరు దూరం పైగానే పిల్లాజెల్లా సంక నెత్తుకొని వడివడిగ నడిసిన్రు.

"అరేయి ! ఎటువోతున్నర్రా !" అని కుశలమడిగిండు ఏజెంటు సైకిలు మోటారు మీదినుంచి దిగకుంటనే.

"అయ్య ! ఏదో ఆడిపోరగాండ్లు సీనిమ్మకోదామని రోజు మొత్తుకుంటె కొంచెం తీరిందని రెండో ఆటకు పోదామని బయలెల్లినం సారు." మనిషికింత మూటగట్టిన ధైర్యంతో మంచిగనే జవాబిచ్చిన్రు.

"ఇపుడేం సిన్మానయా ! రాత్రి పదకొండున్నరైంది. మీరు ఆడికివోయె టాల్లకే ఒంటిగంటైతది. మరి యీ ముచ్చట ముందే జెప్తె మిమ్ముల్నందర్ని టిప్పర్ల పంపకపోదునా ! రాత్రి బాగైంది గుడిసెలకోన్రి."

ఏదో పనిఉన్నవానితీర్గ సైకిలుమోటారు మీద బంట్లతో పదిగజాలు దూసుకు పోయి సీకట్ల యింజన్ బందుచేసి దారికాసి నిలబడ్డట్టున్నడు.

సైకిలుమోటారు సప్పుడు ఒకటేసారి బందయ్యేసరికి ఏజెంటు, బంట్లు ఎక్క డున్నరో ఊహించినట్టున్నరు. ఎనుకకు మర్లిన్రు.

సాతగాని పానాలతో ఏంజేయలేక ఉసూరుమన్నట్టున్నరు.

తెల్లవారింది. గోడపత్రెల్లోంచి ఎలుగు అలాఅలా దూరం పాకినటు ఈ వార్త సైటంతా పాకింది.

అన్ని యూనిట్ల లేబరు ఎవలకు వాల్లు గుసగుసలు వెడుతున్నరు.

సైటంత ప్రశాంతంగా ఉంది, రేపుపేలే అగ్నిపర్వతంలా.

*　　　　*　　　　*

రోజులు గడుస్తున్నయి, వాల్ల జీవితాల్లాగనె బరువుగ.

''ఎప్పుడు చెప్పిపంపుతె ఎప్పుడు కలుత్తున్నరు మీరు. నాకేమొ మీదగ్గరికి వచ్చుటానికి వీలుగాదాయె.'' అన్నడు సురేందరు.

''మేం మీరు చెప్పంపక ముందట్నుంచే మిమ్ములను గలుద్దాం అనుకుంటే ఆనాట్నుంచి మమ్ములనెటు కదలనిత్తలేరాయె. ఏంజెయ్యి మంటారు సారు! సాపన్నరాకపాయె!''

''ఇదిగో నర్సన్నా! ఇగమీకు ఈడ ఉండబుద్దిగానపుడు మీకు పంచ బచ్చ

పరమాన్నాలు పెట్టినా సయిపడ. ఎట్లె నారు మీరంత పీనుగులోలె'' టిప్పరు స్పీడు పెంచిండు సురేందరు.

''ఏంజెయ్యాల్నె సారు! మీరే ఏదన్న ఉపాయం జెప్పు[ని. ఏదో ఉపాయం జెయ్యవోతె మాది పారకపాయె. ఇగమీరె ఎట్లన్న జేసి మేమందరం అవుతలపడే ఉపాయం జెప్పు[ని. ఈస్నుంచవుతలపడ్తె అవుతల ఎట్లనన్న జేసి యింటికివోతం! ఆఖరికి బిచ్చమడుక్కోని తినుకుంటనైన ఇంటికి జేర్తం. ఈడమాత్రం బతికెటట్టు లేం'' కలుగుతున్న బాధను లోపల్లోపలే కుక్కుకొంటున్న వాల్లను చూస్తే కండ్లకు నీరచ్చింది సురేందరుకు.

''మీరు జిల్లా కలక్టరుకు మీ పరిస్థితి ఉన్నదున్నట్టురాసి, యింటికి వోత మంటె పోనిస్తలేరని, జ్వరాలస్తె మందులిస్తలేరని...అన్ని వివరంగ రాసి దరకాస్తు దీసికొనిపోయి కలువు[ని''.

''అల్లకు దెలిస్తె మమ్ముల్నసరికి కాల్వకట్టకు పాతరవెట్టరా''

''అట్లేం జరగది మీరు దరకాస్తు రాసినట్టు ఎవరికి తెలువనీయకపోతె ఏం గాదు.''

''మరి మావోల్లందర్ని యిసారిచ్చు కోవాల! ఏమంటరో మరి!''

''సరె యియ్యాల రాత్రి విచారించుకో[ని. రేపు పగలు నేను తాలుకాకు మల్లవోయే పనున్నది. మీలో ఎవరన్న యిద్దరు ఎవరికి తెల్వకుంట తుమ్మచెట్టు కాడికి రా[ని! తోలుకువోత!''

* * *

''రండి. కూర్చోండి. వీళ్ళు నిన్న వచ్చారట. నాకు యిపుడే కలిశారు. నిన్న నేను టూర్ పోయానని తెల్సి ఎలాగైనా నన్ను కలువాలని రాత్రంతా బస్టాండులో ఉండి, ఉదయమే వచ్చారిక్కడికి. అందుకే ఫోన్ చేసి మిమ్ములను పిలి పించానిక్కడికి. వీళ్ళకు ఏ సౌకర్యాలు లేవని, యిపుడు యింటికి వెళ్ళిపోతామని, పోదామంటే పోనీయడం లేదని చెప్పారు. వీళ్ళేమీ బాండెడ్ లేబర్ కాదు. మనం బాండెడ్ లేబరునే విడిపిస్తున్నాం కదా! వీళ్ళకు రావల్సిన కూలిపైకం కూడ ఎకౌంట్సు చేసి యిప్పించి వీళ్ళని వీళ్ళ యిండ్లల్లకు పంపించే ఏర్పాటు చేయిం చండి.''

జిల్లా కలక్టరు వాళ్ళిచ్చిన దరకాస్తుమీద తొందరగ చర్యతీసుకొమ్మని ఆదే శించి, రాసి అతని చేతికిచ్చాడు.

లేబరాఫీసరు ఆ అన్యాయాల గురించి అపుడే వింటున్నట్టు బాధపడి పోయిండు !

* * *

"నమస్తే సార్" అంటు పలుకరించిండు ఏజెంటు.

అది పట్టపగలు.

లేబరు, లేబరాఫీసరు ఒకే జీపు నుంచి దిగుతుండడం చూసిన ఏజెంటుకు, పట్ట పగలే సూర్యుడు చుక్కలు కలిసి కనిపించినట్లైంది.

"నేనేదో మనసులో పెట్టుకొని యిలా చేశాననుకోకండి నా ప్రమేయం చాలా తక్కువ. ఇది కొత్త కలక్టరు చేశాడు. దీని మీద యాక్షన్ తీసికొమ్మని నాకు రాసాడు యిదిగో చూడు" అంటూ చూపించిండు.

"ఈ కలెక్టరుకు మీ గుత్తెదారు విషయం యింకా తెలియనట్టున్నది. సేయం మనిషిని ముట్టుకొనేంత ధైర్యం ఈ కలెక్టరుగారికెక్కడిది. ఏదో యింకా తెలియనట్టుంది.

ఇంగ్లీషు యితరులెవరికి అర్థంగాకుండ వాళ్ళిద్దరు స్వేచ్ఛగ మాట్లాడుకోవ డానికి అవకాశం యిచ్చినందుకు మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నరు.

దరకాస్తులోని చేతి రాత చూసి దూరంగ నిలబడ్డ సురేందర్ వేపు ఎందుకో అదో రకంగా చూసిండు ఏజెంట్.

"రాయలసీమ వాళ్ళను రమ్మంటె అందరచ్చిన్రేంది. ఇదేమన్న చోద్యమా? పనిచేసుకో పొండి" అన్నడు ఏజెంటు.

"అవును! మిగతా వాళ్ళంతా ఎవరి పని వాళ్ళు చూసుకొండి." అన్నడు లేబరాఫీసరు.

"అందరూ వెళిపోయినట్టేనా?" అడిగిండు ఆఫీసరు ఏజెంటును పది నిమిషాల తర్వాత.

"ఆఁ!" అన్నడు ఏజెంటు.

"ఈ దరఖాస్తు ఇచ్చింది మీరేనా" అడిగిండు ఆఫీసరు అందర్ని కలియ జూసుకుంటు.

''అవునయ్యా'' అన్నరు అందరు ఒకేసారి.

''మంచినీల్లు తెద్దాం రాన్రి'' అన్నడు మేస్త్రి ఎల్లయ్య ఆడోల్లనుద్దేశించి. వాల్లు తటపటాయిస్తున్నరు.

"ఫర్లేదు! మీరెళ్ళండి మీరందరు వచ్చేవరకు యిక్కడే ఉంటాను'' నమ్మ బలికిండు ఆఫీసరు.

అయిష్టంగానే కదిలిన్రి ఆడోల్లు.

"మీకు మందులు, సెలవులు యిస్తూలేరని మంచి తిండిపెట్టడం లేదని

రాశారు మీరిందులో! నిజమేనా?"

"అయ్యా! మీరు జూస్తలేర! మేం ఎట్లున్నమో! మా గుడిసెలెటున్నయో! కన ప[illegible]న!''

"అయితే యికనుండి మీరు కోరిన సౌకర్యాలన్నీ కల్పిస్తే పని చేసుకొంటు ఇక్కడే ఉంటారా!'' అడిగిండు ఆఫీసరు.

"మీరేమన్న జెయ్యుండ్రి గని మేం మాత్రం యింటికే వోతం''

అరగంటసేపు ఎందుకు అని, ఉండమని యక్షప్రశ్నలతో గుచ్చి గుచ్చి అడిగి గుత్తెదారు తరపు వకాల్తాలో ఓడిపోయినట్టు మొకం బెట్టిండు ఆఫీసరు.

"సరే మీయిష్టం! మీకు తేలవలసిన కూలీ పైకం లెక్కచెయ్యాలి గదా! ఎంతసేపని నిలబడ్తరు! అలా కూర్చొండి'' అన్నడు ఆఫీసరు.

ఏజెంటూ, మేస్త్రీ, ఆఫీసరూ కలిసి అరగంటదాక ఏదేదో లెక్కలు చేసిన్రు

"మీకు ఒక్కపైసాగూడ తేలలేదు. మీరే కొందరు కొంతపైకం ఎక్కువ వాడుకున్నరు.''

"అయితే మీరు దూరం బోవాల్సినవాళ్ళని మీ మేస్త్రీని, ఏజెంటును సముదాయించి చెరిసగం భరించుమని చెప్పి నేను వీళ్ళిద్దర్ని సముదాయించి తలాపదిరూపాయలు యిప్పిస్తున్నా తీసికొండి" అన్నడు ఆఫీసరు.

రానికాడ 'రాయి' అయినా వచ్చిందని అందరు సరే అని సంతోషపడ్డరు.

"ఇక వెళ్తాను నేను" చేతిల చేయిగలిపి ఏజెంటుకు చెప్పి జీపెక్కిండు.

లేబరు జీపెనుకే నిలబడ్డరు.

"మీకోసం వండిన అన్నం పాడైతది. తినిపోన్రి" అన్నడు మేస్త్రీ ఎల్లయ్య. అది చివరి బాణమో ఏమోమరి.

"మాకు తిండివద్దు! తిప్పలువద్దు! అయ్యా! లేబరాఫీసరు సారూ! మీరు కొంచెం ఆగుండ్రి. మీరు ఎనుక ఉండున్రి మేం ముంగట నడుత్తం'' అన్నరు.

"వీళ్ళని టిప్పర్లో జిల్లాపట్టణం దాక పంపించండి.'' "ఈ జీపులో కూడా కొందరు ఎక్కండి టిప్పర్లో పట్టకపోతే" కొరకరాని కొయ్యలైన ఆ లేబర్ను ఏం చేయాలో తెలీక అన్నడు లేబరాఫీసరు.

టిప్పరు క్యాబిన్లో నర్సయ్య, సాయిలు కూర్చున్నరు. పేరు పేరున కృతజ్ఞతలు చెప్పుకున్నరు సురేందరుకు.

టిప్పరే ముందునడిచింది. జీపు వెనక వచ్చింది.

'అవుసార్! ఆఫీసరత్తె ఏజంటు గల్లెందుకు భయపడ్డడుసారు. మేస్త్రీ ఎల్లయ్యను ఎందుకెను కేసుకచ్చిండు.' అడిగిన్రి.

'మేస్త్రీ ఎల్లయ్యే కాదుగద గుత్త పట్టింది. మీరు ఏ ఫిర్యాదు చేసినా ఎవల మీద చేసినా రూలు ప్రకారం ప్రభుత్వం గుత్తెదారు మీదనే చర్య తీసికొంటుంది. అందుకే ఆ కంగారు.' అన్నడు సురేందరు.

'గుత్తెదారుకు ఏమన్నయితే వాన్నొకరి గుత్తెదారు పీకేత్తడని వాని భయం వానిది' అన్నడు మల్ల.

'ఒకూరి యాతాలకు యింకో వూరి జీతాలకు పొత్తు కుదరదని, ఉన్న వూల్లనే యాతాలకు జీతాలు గుదిరి కూలి పెంచుకోవాల్నని పుట్టి పెరిగిన టిల్లల్లకు వోతున్నట్టు' చెప్పుకున్నరు సురేందరుకు.

పాలమూరు, ఒరియా లేబరు మాత్రం పనిచేసుకుంట కాల్వ మీదనే ఉన్నరు. వాల్లది తమ విజయమే అన్నట్టు చాటుకున్నరు. అంతవరకు కనుసైగల భాషణ, గుసగుసల భాషగా ఉన్న వాల్ల బాధల భాష గులకరాల్ల భాషగ గల గల పారింది.

* * *

"ఇదిగో ఈ సైకిల్ మోటర్ మీద వెళ్ళి ఒక పెట్టె బీర్లు, రెండు విస్కీ బాటిల్సు తీసుక రా ఫో" అన్నడు ఏజెంటు.

"వెనుక బీర్లు గట్టుకొని నాకు తేరాదు. నారాయనను నా తోటి తోలియ్యిన్రి. వెనుక కూర్చుండి పట్టుకొంటడు."

''ఛ! ఛ! నీకు ఏ పని జెప్పినా యింతే. నీకు జెప్తే నీ తోకకు జెప్తవు. వాడు సురేందరే మంచిగుండె. అంత చదువు చదివినా గర్వం లేకుండె. ఏ పనంటె ఆ పని సక్కగ జేస్తుండె. రాత్రంటె రాత్రి, పగలంటె పగలు ఎప్పుడైనా పని జేస్తుండె. నీ తీర్గ ఎన్నడు వంకలు పెట్టక పోవు. గుత్తెదారుకు జెప్పివాన్ని దీసే యించుడు తప్పైంది... ఇగ దోల్కపో! వంటాలస్యమైతే కానీ. ఏంజెయ్యాల'' విసుక్కున్నడు ఏజెంటు.

''మల్లయ్యా! నువు పక్క పల్లెలకోయి రెండు కోల్లు జాద దీస్కరా'' అన్నడు ఉన్న ఒక బంటుతో.

''నారిగాన్ని అటు తోలెయ్యవత్తిరి. నేను కోల్లకు వోలె ఇగ మసాల లెప్పుడు నూర్తరు. బగారెప్పుడైతది? ఇల్లిల్లు ఎవడు దిరుగాలె?'' అనుకున్నడో ఏమో.

''అయితే చిన రాజయ్య మేస్త్రిని ఇక్కడికి రమ్మను''

చిన రాజం వచ్చినంక ''ఇదిగో రాజం! ఈ పక్క పల్లెల కోయి రెండు కోల్లు జాద దీస్కెరా'' అన్నడు ఏజెంటు.

''నేను కోల్లకు దిరుగ వోతె సైటు మీద ఎవడు పని జెయ్యడు. కావాలంటె యిద్దరు లేబర్ను దో్లి''

గాలికి బోయే కంప తనకెందు కనుకున్నాడో ఏమో.

''తొందరగ పంపించు'' అసహనంతొ అన్నడు ఏజెంటు

పది నిమిషాలు గడిసినయి.

గాలన్న షెడ్డు దగ్గరున్న డీజెల్ డ్రమ్ముకానుకొని నిలబడ్డడు. పందిరి గుంజ సాటుకు వీరయ్య.

అచ్చిన పని అట్లే చెత్తరసుకున్నట్టున్నరు.

''అరేయి మీరిద్దరు గల్సి పోయి ఈ పక్క పల్లెల రెండు కోల్లు జొటదీస్కరాని. ఓ రూపాయి ఎక్కువ పెట్టయినా తీస్కరాని. అదిదాక వోయి ఉత్త చేతులోటి ఊక్కుంట రాకుండ్రి.'' జేబులోంచి పది రూపాయల నోట్లు నాల్గు తీసి చేతిలో పట్టుకొని తీసికొమ్మని వాళ్ళ వైపు చూసిండు.

పైసలు దీసుకునుటానికి ఎవలు ముందుకు కదల్లేదు.

అంతవరకున్న అసహనం కోపంగ మారినట్టుంది.

''అరేయి లంజకొడుక చెప్పేది మీక్కాదుర! చెప్తె చెవులిన పడ్తలేవుర!... ...ఎవడు కదలడేంర!'' అంటూ నోట్లు పట్టుకొన్న చెయితో గాలన్నను పిలిచిండు రమ్మని.

దగ్గరికచ్చిండు గాలన్న. అయినా చెయి జాపి నోట్లు అందుకోలేదు. అట్లనే నిలబడ్డడు.

అయిదున్నర అడుగుల పైనే ఎత్తున్న గాలన్న దగ్గరి కచ్చి అలా మాట్లాడకుంట నిలబడేసరికి కుర్చీలో కూర్చుండి ఉన్న ఏజెంటుకు కొట్టెతందుకు వచ్చిండా అని మనసులనే ఒక్కసారి ఉలిక్కి పడ్డడు. అయినా తమాయించుకొన్నడు, అది అసందర్భపు ఆలోచన అని.

గాలన్న పెయి మీద అంగి లేదు. మడి పంచెలా కట్టిన ముడ్డి పంచె బిల్లగోసి పెట్టి కట్టిండు. ఆ పంచె నల్లగ జిడ్డుగున్నది. దాని తెల్లదనం కోల్పోయి కాయ వట్టినట్టున్నది.

నేలచూపు చూస్తున్న గాలన్న నిలేసిన గడ్డపారలా కన్పించిండు.

"చెప్తె చెవులినపడ్తలేవుర" మల్ల అన్నడు. అక్కన్నేవున్న సూపరువైజరు, యింజనీరు మవునంగ ఆశ్చర్యంగా చూస్తూ, అక్కడున్న పత్రికలు తిరగేస్తున్నరు.

"అవుర ! అని పిలిస్తె ఎవుర్నో అనుకున్న" గాలన్న శాంతంగ.

"నీ పేరు నాకేమేర్కటుర లంజకొడుక ! అవుర అని పిల్వక యింక

నిన్నేమని పిలవాలెర" కోపం తారస్థాయినందుకున్నట్టున్నది. గొంతు పెరిగింది.

"నా పేరు లంజకొడుకు గాదు, గాలన్న" కోపాన్ని బిగపట్టినా అయినా మాటగట్టిగనే వచ్చింది.

అవాక్కయి పోయిండు ఏజెంటు అనుకోని జవాబుకు. అటుయిటు చూసిండు బీర్లకోయిన టిప్పరు డ్రైవరు బంటుగాడు రాసట్టున్నరు. ఉన్న ఒక్కడు షెడ్డు లోపల ఏదో నూరుతున్నట్టున్నడు.

లోపల నూరుతున్నట్టె పండ్లు నూరినట్టున్నడు ఏజెంటు అంత జరిగినంక గాలన్నకు పైసలిచ్చి పని చెప్పటానికి మనసొప్పలేదు.

'అని పేరేంది' అన్నడు.

'ఆయన పేరు వీరయ్య' అన్నడు గాలన్న. ఏజంటుకు మళ్ళీ అహం దెబ్బతిన్నది.

"వీరయ్యా! మీరిద్దరు గల్సి, పల్లెకుపోయి తొందరగ కోలు జాడదీస్కరాన్రి" అని నోట్లు చేతిల పెట్టిండు. వాల్లు ఎల్లిపోయిన్రు.

''లేబరు పూర్వంలా లేనట్టున్నరు. బాగ తెలివి మీరిపోయినట్టున్నరు అరేయి అంటే పడుతలేరు.'' అన్నడు సూపర్వైజర్.

''నేను నాగార్జునసాగర్‌డాం లో జేయీ గా అపాయింటయినపుడు యిలా ఎవరైనా మాట్లాడితే మరుసటిరోజు వాడి అడ్రసు కన్పించకపోవు. ఇపుడు ఎవర్ని ఏమీ అనొచ్చేట్టు లేదు. బుజ్జగించి పని చెప్పాల్సి వొస్తోంది.''అన్నాడు యింజనీరు. ఈఈ గా ప్రమోషన్ రావాల్సినా ఎపనికి పెట్టకుంట ఉన్నదంత తనే దోసుకు తినే తత్వంగలవాడు కావడంవల్ల పై అధికార్లకు ఏమి ముట్టజెప్పక పోయేసరికి 'కాన్ఫిడెన్షియల్ రిపోర్టు' సరిగ్గాలేక ప్రమోషన్ ఆగిపోయి ఏఈ గానే ఉండిపోయిండు.

'' సరే!... మేం ఈ ప్రక్కనున్న సైటుకూడా చూసొస్తాం''అని లేసిన్రు

''తొందరగ వస్తే బాగుండు'' అన్నడు ఏజెంటు.

''ఎంతసేపు? అరగంట! అలావెళ్ళి యిలా వచ్చేస్తాం'' వాల్లుపోయిన్రు.

'వీల్లు పోయినంక ఇట్ల జరిగినా బాగుండు. వాల్లముందు ఉన్న పరువు పాయె' అనుకొన్నడు ఏజెంటు.

★ ★ ★

ఎర్రజెండాలు పట్టుకోని అటుయిటూ ఊపుతున్నరు. నీటి పాయలో పలుగు పారతో ఎవరూ పని చెయ్యటం లేదు.

అల్లంత దూరంల చెట్లకింద అందరు జమైన్రు. అట్ల అందరు ఒక కాడ జమగాపడం అరుదైన సంగతి. వాల్లంత కాలుటానికి తయారు అన్నట్టున్న నల్ల బంగారం పోలె ఉన్నరు. ముడి పంచెతప్ప ఎవరి పెయిమీద అంగీలు లేవు. మాసి

పోయిన తలలు, లేసిపోయిన గుంట్రుకలు, చెమటలు కారిన శరీరాలు, చినిగిపోయిన చీరలు, అన్నీ కలిసిపోయి 'ఒకే రంగులో' కన్పిస్తున్నరు.

పొలికేక...

రాజయ్య, పెంటయ్య వీరయ్య, గాలన్న మొదలైనవాళ్ళు ఏడెనిమిది మంది దాక నీటి పాయలోకి నడిసిన్రు.

మరో పొలికేక......

ఆ కేక విని గబగబా దబదబా దూరంగ ఉరికిన్రు. అలా క్షణం గడిచిందో లేదో భూమి దద్దరిల్లినట్లు ధ్వని వినిపించింది వాళ్లకు. ప్రాణాలు పోయినట్టే నసుకొని పరిగెత్తిన్రు. అయినా లాభం లేక పోయింది. పట్టున పగిలి ఆకాశంలకు ఎగిరిన బండలు రాజయ్య, పెంటయ్య లిద్దరి మీద బడ్డయి. బిగ్గరగా ఆర్తనాదం చేస్తూ పరిగెత్తుకుంటనే పడిపోయిన్రు.

అంతవరకు విశ్రాంతిగా వున్న వాతావరణంలో కల కలం మొదలైంది.

ముందుగా ముందుకు ఉరికిన వీరయ్య, గాలన్న మొదలయిన వాల్లు ఆర్తనాదం విని ప్రాణాలు పోయినాసరే నసుకున్నట్టున్నరు. వడివడిగా వెనుదిరిగి పడిపోయినోల్లను మోసుకొచ్చిన్రు.

అయ్యో! అయ్యో! అంటున్నరు. ఏమవుతుందోనని ప్రాణాలు బిగవట్టి చూస్తున్నారంత. రాల్లకు పెట్టిన బత్తీలు రెండు ప్రమాదవశాత్తు తొందరగ పేలి క్షణాలమీద ప్రమాదం జర్గిపోయింది.

* * *

డాక్టరు కన్సల్టింగు రూంల కూర్చున్నడు, చేతులు తుడుసుకోని. గాలన్న, వీరయ్య, ఏంజెప్తడో అన్నట్టు ఎదురుసూసుకుంట డాక్టరు ఎదురుంగనే వంగి నిలబడ్డరు చేతులు కట్టుకోని.

ఏడుపులు గట్టిగ వినపడుతున్నయి డాక్టరుకు.

"ఆ ఏడుపులు ఆపమనండి. బయటకు పంపించండి లేకపోతే" అన్నడు డాక్టరు.

"రాజయ్య తల పగిలింది. వెన్నుపూస కదిలింది. ఇంకా చిన్న చిన్న గాయాలు చాల అయ్యాయి. పెంటయ్య కండలన్నీ దెబ్బదిన్నయి. వెన్నుపూస విరిగింది. దెబ్బలు కూడా బాగానే తాకాయి. చాలా రక్తం కారిపోయింది. యిపుడు శరీరంలో రక్తం చాలా తక్కువగా ఉంది. గ్లూకోజులు యింకా రెండుమూడు రోజుల వరకూ ప్రతి గంటకూ ఎక్కించాల్సి ఉంటుంది. వీరికి రెండు మాసాలు విశ్రాంతి అవసరం. ఒక నెల మాత్రం ఈ హాస్పిటల్లోనే వుండాల్సి వుంటుంది. మీరెవరూ అలా పూరికే మాట్లాడించకండి. మాట్లాడిస్తే తల కండరాలన్నీ కదులు

తాయి. కుట్లు కుదురుకోవు మరి. మీరు వెత్తె వెళ్ళండి. వీళ్ళని కనిపెట్టుకు ఉండడానికి వీళ్ళ భార్యల్ని వెంట ఉండమనండి. కాని ఆ ఏడ్పులు పెడబొబ్బలు మాత్రం వద్దని చెప్పండి. వాళ్ళని ఊరికే మందలించొద్దని చెప్పండి."

ఎర్రని రక్తం మరకలున్న ప్రతిచోట తెల్ల పట్టీలు పడ్డయి. ఇద్దరికీ పెయి నిండా తెల్లపట్టీలే అయినయి.

నల్లని మనుషులను తెల్లపట్టీల్తో చూస్తే కడుపులో పేగులు దేవుకువచ్చినట్టయి నయి ఎల్లయ్యకు, లచ్చవ్వకు.

భోరుమన్నరు. డాక్టరు కోప్పడితే కుంపటోలె బాధను కడుపులనే కుక్కు-కున్నరు.

★ ★ ★ ★

''అల్లను నెలరోజులు దాక దావకాన్లనే ఉంచుమన్నడు డాక్టరు. మరి కర్చులకు పైసలియ్యరని'' అడిగిండు గాలన్న.

''యిపుడు పైసలు ఎక్కువలేవు. వారంరోజుల కోసం యీ పైసలు యిచ్చి రాపోరని. ఆలోపలనేను అటువోయే పనిగూడ వున్నది. అటువోయినపుడు నేను రాంగ అక్కన్నే పైసలు యిచ్చివస్త. అట్లనే ఒకసారి చూసినటు గూడ ఉంటది. అని ఏజెంటు కొంత పైకం చేతిలపెట్టిండు గాలన్నకు.

★ ★ ★ ★

ఏజెంటు పైసలు యిచ్చి పరామర్శించి వచ్చే బదులు, ఎందుకోగాని, డాక్టర్ను కలిసి, ఏదో మాట్లాడి, వాళ్ళను టిప్పర్లో వేయించుకొని, సైటుకు తెచ్చిండు.

'వాయ్యో ! అంటు విలవిలాలాడిరను' టిప్పర్లో సడుములు ఎత్తేసి.

రెండుమూడ్రోజులు విశ్రాంతి దొరికింది.

పనిచేసిన పానానికి అందరిని చూస్తూ కూలిపోతున్నదని విలవిలలాడిండ్రు. తిండి సయిపక కొట్టుకున్నడు. పనిజేత్తె ఏదన్న కొనుక్కొని తినచ్చని ఆశపడ్డరు.

★ ★ ★ ★

విశ్రాంతి తీసికొమ్మన్నా తీసికోక ఆరోజు మెల్లమెల్లగ పనిచేసిండు రాజయ్య.

మూడో రోజు ఉదయం రాజయ్య లేవకుంటయ్యిండు. లచ్చవ్వకు దావ ఖాన్నుంచి తోలుకచ్చిన కాన్నుంచి బిక్కుబిక్కుమంటనే ఉన్నది. ఆరోజు రాజయ్య నిడిసి పనికి పోబుద్దిగాలేదు లచ్చవ్వకు.

'అంత ఎట్లనో అయితాంది' అన్నడు రాజయ్య. లచ్చవ్వ మరింత భయ పడ్డది.

19

అందరు పనిమీదికి పోయిన్రు. అడివిల ఉన్నట్లనిపించింది లచ్చవ్వకు.

కాల్లు చేతులు విలవిల తన్నుకున్నడు రాజయ్య. మెడ లంకరపెట్టిండు. నాలుక కొరుక్కున్నడు.

ఏం చెయ్యాల్నో తెల్వక లచ్చవ్వ నెత్తంత కొట్టుకుంటు సైటుకెయి గావు కేకలు పెట్టింది.

తల్లితో పిల్లలు ఏడుపు అందుకొన్నరు.

అది విని వచ్చి 'అయ్యో! అయ్యో' అని దావకాన్లకు తోల్కపోదామని తయారవుతున్నరు గాలన్న, వీరయ్యలు,

వాల్లు చూస్తుండంగనే కాల్లుసేతులు బిగపట్టి, వనుకుతుండగ, మెడలువంకర తిరుగంగ, నాలుక్కరుచుకొని, కండ్లు తేలేసి వాళ్ళనే చూస్తూ ప్రాణం ఇః సిండు రాజయ్య. టెటానస్ రాజయ్య ప్రాణం తీసింది.

'డాక్టరు వద్దనంగ ఏజెంటు తోలుకచ్చిండు'.

లచ్చవ్వ ఘోరుమంది. పిల్లలు గొల్లుమన్నరు.

లచ్చవ్వ ఏడుస్తుంటే వాల్ల కండ్లల్ల నీల్లు తిరిగినయి. దుక్కంతో వాళ్ళ హృదయాలు బరువెక్కినై. నల్లనిరాల్లోలె నిలబడిపోయిన్రు.

వాల్లకండ్లల్ల తమవైపే చూస్తూ ప్రాణాలు విడుస్తున్న రాజయ్యనే కన్పిస్తున్నడు యింకా......

బరువైన నిశ్శబ్దంలో లచ్చవ్వ, పిల్లల ఏడుపు తప్ప ఏమీ లేదు. ఆ ఏడుపు సైటంతా యినవడుతున్నది.

అందరూ గుడిసె షెడ్డుకెయి చూసిన్రు.

సుడి గుండం లాంటి ఆ చూపులు తప్పించు కొనేటందుకే అన్నట్టు ఏజెంటు ఆ రోజు ఉపయమే పని పేరుమీద ఎటో వెళ్ళిండు.

★ ★ ★ ★

రాత్రి పొద్దువోయేదాక ఎవ్వరు నిద్రవోలేదు.

ఏజెంటు వత్తదేమోనని ఎదురు చూసిన్రు. ఆ చీకటిరాత్రి అ ఎదిరిచూసుడుతోనే గడిసిపోయింది. వాల్ల కండ్లల్ల కాలేసిన రాజయ్యనే మెదులుతాండు.

'అగో! ఆడే నన్ను జంపింది' అని రాజయ్య చూపులు వాల్లకు చెబుతున్నట్టనిపించింది. లచ్చవ్వ ఏడ్పు వాల్లకు చెవులల్ల యింకా యినిపిత్తున్నట్టే ఉన్నది. తల్లి వెంటపిల్లలు యింకా బాపురుమని ఏడుస్తున్నట్టే వాల్లమనుసుల్లో కనిపిస్తాంది. ఏం జెయ్యాలనేది ఆలోచించుకుంటనే మాగన్ను నిద్రవోయిన్రు. చీకటి పోలేదు ఇంకా తెల్లారలేదు. ఉలికిపడి లేసిండు గాలన్న మాగన్ను నిద్రనుంచి ఏదో

మర్చిపోయినట్టు.

అందర్ని లేపిండు.

'ఎన్ని రోజులే ఈపాడువడ్డ బతుకులు? నిన్నరాజన్న జచ్చిండు. యియ్యాల నేను జత్త. రేపునువ్వు జత్తవు. దీనికి యిరుగుడు మందు జూడాలె'

'ఏం జేద్దా మంటవే'

'మనకు సురేందరు సారు మునుపు జెప్పలేద! ఆసార్ జెప్పినట్టు చెయ్యక పోతే యిగ గుదిరేటట్టు లేదే.'

'ఏం తిండే అది? ఆ తిండి మనకు వట్టది. ఆ పైసలు కోసుడు వట్టది. మన పైసలు మనకు వారెయ్యాలె. మేమే అండుక తింటం అని జెప్పాలి.

"మనగ్గూడ యూనిట్ల సొప్పున కూలి గట్టియ్యాలె' 'ఎంత మొత్తుకున్నా ఈ కాన్నుంచి ఏడుగంటలకంటె ఎక్కువ పని జెయ్యద్దు."

'గీ పల్లెల కూలోల్ల తీర్గ కొట్లాడాలె. ఆల్లు సతెం మనకు మద్దతుయిత్తరు'.

పాడై పోయిన బత్తీలను సపలై చేసినోల్లను జేల్లెయ్యాలె''

''రేకుల షెడ్లు యెయ్యకున్నా యేసినట్టు, మందులియ్యకున్నా యిచ్చినట్టు, రాసి సంతుకం బెట్టే ఈ యింజనీర్ల దవురుజెన్నం యిగ సాగనిచ్చేది లేదు''

''ఆడు లేబరాఫీసరు ఆని తరపున్నే మాట్లాడె. అన్ని సక్కగ జెయ్యాలె.''

''మనవంటె గడ్డపారలు సతెం బెదురుతాన్నయి, యినాం లేకుంట పొడిసి పొడిసి సంపుతున్నరనిగని, ఈల్లు ఏడ బెదిరెటట్టున్నరు పాషానంగాల్లు''

''పాషానాలు సతెం మనకు బెదిరి పలుగుతాన్నయిగాని ఈల్లను కరుగ దీసుడైత లేదు.''

''గడ్డపారలతోటె యిగ ఆల్లను కరుగదియ్యాలె. పలుగ జీరాలె.''

''కలిసికట్టు గుండాల్నెయిగ''

''ఒక మాట మీద నిలవడాలె''

''ఏవన్నయితె అందరం గల్సి పని బందువెట్టాలె''

''చేసుకుంటె కుండగాలె లేకపోతెగు...గాలె ఎట్లనె''

''పుట్టిందోనాడు, సచ్చిందోనాడు, గద్దప్పుతాది ఎన్ని దప్పినా సత్తె జత్తిమి. పోంగ ఏం గొంచవోతన్నం తియి! సచ్చేదాక కడుపు తిప్పలేనాయె. ఇగ సుకపడ్డదెన్నడు. గీ పాడువడ్డ బతుకులకు అపుడు సత్తేంది ఇపుడు జత్తేంది?''

''మనయి మొండి జీవాలు గాదె. గట్ల జచ్చేదుంటె ఎన్నడో సద్దుం గీ కటాలకు''

''మరి ఏమంటవె గాలన్న?''

"నేననేదేందె? మీరన్నయే నేనంటన్న.''

''కూలీలు పెంచాలె. మందులిప్పియ్యాలె. దెబ్బలు దాకుతె మంచిగయెదాక దావ కాన్లనే ఉంచాలె. ఆ కర్సు ఆల్లే పెట్టుకోవాలె. పెంటన్ని మల్లి దావకానకు దోల్కపోవాలె. అడ ఉన్నన్ని రోజులు, కూలి సతెం గట్టియ్యాలె"

''మంచి షెడ్లు ఏపియ్యాలె. ఆరానికో సీనిమ్మ జూపియ్యాలె."

గిట్ల రాజన్నాలె ఈకాన్నుంచి ఎవలు సావకుంట జూడాలె."

''యిపుడు రాజన్న పిలగాండ్లకు యిరువై ముప్పయి వేలు యియ్యాలె. ఆధారం జూపియ్యాలె.''

''రేపెవలన్న జత్తె గూడ ఆని పెండ్లాం పిల్లలకు యిరువై ముప్పయి వేలిచ్చి ఆదారం జూపియ్యాలె''

"ఎవలదాల్లను సంతం అండుకోనియ్యాలె''

"ఎవలి పైసలు ఆల్లకు అంగడి రేపనంగబట్వాడ వంచాలె."

''దేనిగ్గూడ పైసలు పట్టుకోవద్దు''

''జరమచ్చి పంటె కూలి గట్టియ్యాలె.''

''ఎవన్ని వెట్టేది లేదు. కొట్టేది లేదు. అదోటి ఇదోటి మనకు పని జెప్పద్దు ఎంగిలి తలెలు గడుగు మనద్దు''

''జీపులల్ల యింజనీర్లు పెండ్లాలను దోలుకోని సీనిమ్మలకోవుడు గాదు. ఆరానికోసారి అచ్చి మనమెట్లున్నమో జూడాలె''

కోడికూర తోటి, బీరుకేసులు, బిరండీ కేసులు కాలి జేసినట్లుగాదు. లంచాలు దినుకుంట, బరఫ్ మిషిని, పంకాలు, పట్టుచీరెలు, సైకిలుమోటర్లు కొన్నట్టుగాదు. బంగ్లాలు కట్టినట్టు గాదు. ఈ కాన్నుంచి గట్లజేత్తె ఊకునేది లేదు. యిదివారకు దిన్నదంత కక్కియ్యాలె.''

''గుత్తెదారుగాడు దెబ్బకు దిగిరావాలె మన దగ్గరికి మనం పని బందువెడ్తె.

ఒరిసోల్లు గూడ పని బందువెడ్తనన్నరు. ఇగ గట్లయితె మొత్తం పనే వంటది. పక్క పల్లెల్లోల్లు గూడ డబలు కూలిత్తనన్నా 'మీరు పని బందువెడ్తె గిట్ల పన్కిరమ్మంటె పోం' అని మాటిచ్చిన్రు.''

''ఇగ గుత్తెదారుగాడు, యింజనీరు గాల్లు గాదు అల్ల తాతలు గూడ దిగి వత్తరు మనకాడికి"

''ఎవడచ్చినా మనను యిగ ఎవడేం జేయలేడు.''

''తెగినోనికి తెడ్డే లింగం. యిగ ఎవడ త్తడో జూత్త మనను ఆపుటానికి''
''అడీగి నయన్ని యిచ్చేదాక పన్జేసేది లేదు. యింకోల్లను జెయ్యనిచ్చేది లేదు''
''కాల్వమీది లేబరు సంగం''

''వర్థిల్లాలె''
''కూలీలంతా''
''ఒక్కటే''
''గుత్తెదార్ల యింజనీర్ల దవురుజెన్నం, దోసుడు''
''నశించాలె''

కాల్వమీది లేబరు జీవితాల్లో తొలిసారిగ తొంగిచూసినట్టు ఆల్ల గుడిసెల మీది ఆకాశం ఎర్రపడ్డది.

—అయిపోయింది—

## పిచ్చుక

మద్దూరు శ్రీనివాసులు

సరుకు
కొట్లోంచి, గూట్లోకి మళ్ళించారు
అడిగితే
అయిపోయిందంటున్నారు
'బ్లాకు'లో కొనడానికి స్తోమతలేదు
కొనకుండా బతకడం సాధ్యంకాదు.
ఏం చేయాలి పిచ్చుకా ?! ...
............... ..........
మేమేం చేయాలి ?
పిచ్చుక బదులు పలుక లేదు.
కిందున్న వడ్లగింజను పొడిచి
బియ్యపు గింజను ముక్కున కరచి
తుర్రుమని వెళ్ళిపోయింది.